క్లుప్తంగా

కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు

- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- షాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్

షాబాద్: కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాలపై సంతకాలు చేయడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మహిళలలకు స్వీట్లు పంచిపెట్టి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, పొన్న జయమ్మ, వెంకట్‌రెడ్డి, హైతాబాద్ ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, అత్తిల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, పోచయ్య, రవి, ముబీన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ఉద్యోగంపై హర్షం

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కోశాధికారి దేవరంపల్లి రాజశేఖర్‌గౌడ్

షాబాద్: వికలాంగురాలికి మొదటి ఉద్యోగం ఇవ్వడం సంతోషకరమని హక్కుల జాతీయ వేదిక జిల్లా కోశాధికారి దేవరంపల్లి రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండలం కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా వికలాంగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమానికి గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదన్నారు. పెన్షన్ మాత్రమే ఇచ్చి విద్య, ఉపాధి వంటి మౌలిక అంశాలను దూరం చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ఈ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలని కోరారు. పెన్షన్ రూ. 6వేలకు పెంచుతామనే హామీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని పేర్కొన్నారు. వికలాంగురాలు రజినికి కాంగ్రెస్ అధికాంరలోకి రాగానే ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవడం సంతోషకరమన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలను అందిస్తున్న విజయలక్ష్మి

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఆడపిల్ల పెళ్లికి పుస్తె మెట్టెలను సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తల్లి విజయలక్ష్మి అందజేశారు. గ్రామానికి చెందిన కాటికేల యాదమ్మ, వెంకయ్యల కూతురు రాజేశ్వరి వివాహం సందర్భంగా విజయలక్ష్మి గురువారం అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

మణికొండ: ద్విచక్ర వాహనంపై వెలుతున్న ఓ వ్యక్తి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీ కొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ అకాడమీ వద్ద మొయినాబాద్ వైపు నుంచి బండ్లగూడలలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నా సలీం(38) డివైడర్‌ను ఢీ కొట్టి కిందపడటంతో తలకు బలమైన గాయాలు తగిలి రక్తస్త్రావం కావటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న ప్రజాప్రతినిధులను ప్రజలు గౌరవిస్తారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురేందర్, సురేష్ రెడ్డిల ఆధ్వర్యంలో పలువురు స్థానిక నాయకులు గురువారం ఎమ్మెల్యేను కలసి ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమరేందర్, వనం శ్రీరామ్ రెడ్డి, కావలి శేఖర్, శ్రీధర్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, శేఖర్, కామసాని మహేందర్ రెడ్డి, చేగూరి అర్జున్ రెడ్డి, పీఎం రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే పి సబితారెడ్డి

- ప్రజా తీర్పును గౌరవిస్తాం
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడుతాం

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో ఇక్కడ చేసిన అభివృద్ధిని చూసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనను గెలిపించిన ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఇక నుంచి ప్రతీ గ్రామంలో పర్యటించి ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. అంతకు ముందు శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీపీ కె. సునీతా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్. శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆనందం, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వట్టిల మల్లేష్ యాదవ్, కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, కూన యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామంలో కొలువైన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవార్లకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతి, గోదా సమేత అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. స్వామివార్లకు పుష్పార్చన, మూలదేవత హోమములు, ప్రసాద వితరణ, సాయంత్రం లక్ష్మి హోమం, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామాలు, పారాయణం, శ్రీలక్ష్మిదేవి కుంకుమార్చన ప్రసాద వితరణ పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దంపతులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, ఎంపీటీసీ పెంటల కుమారిరాయప్ప, శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఆవుల రమేశ్, ఉపాధ్యాక్షులు నీరటి జగదీష్ ముదిరాజ్, కమ్మరి బుచ్చిబాబు చారి, కోశాధికారి కదల భాస్కర్, ప్రధాన పల్లె శ్రీనివాస్ గౌడ్, సంయుక్త కార్యదర్శి హైతాబాద్ రాజు, ఆర్గనైజింగ్ పసునూరి నారాయణ చారి, కోశాధికారి ఇమ్మడి మహేష్, ఉపాధ్యక్షులు పసునూరి నారాయణ చారి, ఆలయ పూజారి ప్రేమ్‌కుమార్ శర్మ పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మార్కెట్..

చేవెళ్ల: రైతులు పండించిన కూరగాయలను సాయంత్రం మార్కెట్‌లో అమ్ముకునే విధంగా మార్కెట్‌ను అందుబాటులోకి తీసుక రాబోతున్నట్లు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మార్కెటింగ్ సౌకర్యం మరింత అందుబాటులో తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో ఉదయం, సాయంత్రం రెండుపూటల మార్కెట్ నిర్వహించేవిధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్, గుడిమల్కాపూర్ మార్కెట్ అధికారులు, ట్రేడింగ్ వ్యాపారులతో చర్చించారన్నారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలను రాత్రి సమయంలో హైదరాబాద్‌లోని మార్కెట్‌లలో అమ్ముకొని తిరిగి రావడమనేది అనేక ఇబ్బందులతో కూడుకుందని రైతులు చెప్పినట్లు ఆయన తెలిపారు. రైతులు తాము పండించిన పంటలను సాయంత్రమే చేవెళ్ల మార్కెట్‌లో అమ్ముకోవటం వల్ల వారికి రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. రైతులు వెసులుబాటును బట్టి మార్కెట్‌లో విక్రయించుకునే వీలు ఉందన్నారు.

మానకొండూరు ఎమ్మెల్యే మనవాడే

ఇబ్రహీంపట్నం: కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఇబ్రహీంపట్నం ప్రజలతో అనుబంధం ఉంది. సత్యనారాయణతో పాటు ఆయన సతీమణి అనురాధ ఇద్దరూ ప్రముఖ వైద్యులే. 27 ఎళ్ల క్రితం ముఖ్యంగా మహిళా వైద్యులు ఎవ్వరూ లేరు. ఆ సమయంలో ఇక్కడ అంకిత్ ఆస్పత్రిని స్థాపించి గైనకాలజిస్ట్‌గా అనురాధ సేవలందించారు. ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తూ సతీమణి పెట్టిన అంకిత్ ఆస్పత్రిలోని పేషెంట్లను జనరల్ సర్జన్‌గా సత్యనారాయణ పరీక్షించేవారు. ప్రతి పేషెంట్‌ను నవ్వుతూ పలకరిస్తూ అందరితో కలువుగోలుగా ఉండటంతో సత్యనారాయణకు ప్రజలతో మంచి సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ముందు నుంచి రాజకీయాలంటే వారికి ఎంతో ఆసక్తి, మక్కువ. ఇబ్రహీంపట్నం ఎస్సీ రిజర్వుగా ఉన్నప్పుడు 1999లో ఆయన సతీమణి అనురాధ టీడీపీ నుంచి టికెట్ ఆశించింది. చివరి నిమిషంలో టికెట్ లభించకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు. ఆ తదుపరి ఆమె భర్త సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన మానకొండూరుపై దృష్టి పెట్టి కాంగ్రెస్ అధ్యక్ష పదవిని, ఇప్పుడు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

సత్యనారాయణకు సన్మానం..

కవ్వంపల్లి సత్యనారాయణను నగరంలో బీఆర్ఎస్ నాయకుడు తాళ్ల మహేశ్‌గౌడ్ సన్మానించారు.

కాంగ్రెస్ సంబరాలు

- రేవంత్ ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు
- కొత్త సర్కారుపై కోటి ఆశలు

కందుకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మూల హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని లేమూరులో టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అందుగల సత్యనారాయణ, జి.సత్యనారాయణరెడ్డి, జి.వీరేశ్, ఎం.ఇంద్రారెడ్డి, రవీంద్రనాథ్, మధుకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, కె.కిషన్, జి.రవీందర్‌రెడ్డి, ఎండీ హకీల్, భాస్కర్, బి.పాండురంగారెడ్డి, అరవిందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. తమ అభిమాన నేత ముఖ్యమంత్రి కావడంపై హర్షం వ్యక్తంచేశారు.



లేమూరులో టపాసులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మస్న రవి కుమార్, ప్రతినిధులు రమేశ్, నర్సింహ, రాజు తదితరులు మహేశ్వరం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.



నేదునూరు నుంచి ప్రమాణస్వీకారోత్సవానికి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు



సభకు తరలిన కాంగ్రెస్ చేనేత విభాగం నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు అభినందనల వెల్లువ

చేవెళ్ల/శంకర్‌పల్లి: హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాలె యాదయ్యకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. గురువారం చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల గడ్డపై మూడోసారి విజయం సాధించి చేవెళ్ల ప్రజల మనస్సు గెలిచారన్నారు. చేవెళ్ల అభివృద్ధిలో ఆయన ప్రత్యేక కృషి చేశారన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ గీతపారిశ్రామిక సంఘం సభ్యులు కలిసిన సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి అందిస్తానని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గొల్లగూడ గ్రామానికి చెందిన మదచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు దయానంద నాగుల వెంకటేశం, ఆయన కుమారుడు గురుప్రసాద్‌లు, శంకర్‌పల్లి మండల గీతకార్మిక సంఘం నాయకులు సత్యనారాయణగౌడ్, జగన్‌గౌడ్, పాండు, రాములు, మల్లేశ్, శ్రీనివాస్, వెంకటేశం, కృష్ణాగౌడ్, గంగాధర్, రాజు, రాఘవేందర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న శంకర్‌పల్లి గీతాకార్మిక సంఘం

బస్ షెల్టర్లేవీ..?



రోడ్డుపైనే గంటల తరబడి ఎదురుచూపు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అమ్డాపూర్ చౌరస్తాలో రోడ్లపై నిలబడిన విద్యార్థులు, ప్రయాణికులు

మొయినాబాద్‌రూరల్: బస్టాప్‌ల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండనకా వాననకా గంటల తడబడి నిలబడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూర్చొడానికి కుర్చీ లేదు. నిలబడదామంటే నీడ ఉండదు. ఎండకు, వానకు బస్సు షెల్టర్లు లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ప్రయాణికులకు నెలకొంది. హైదరాబాద్-బీజాపూరీ ప్రధాన రహదారిలో పోలీస్ అకాడమీ అప్పా మొదలుకొని తోల్‌కట్ట వరకు బస్ షెల్టర్లే కానరావు. దీంతో అటు జంట నగరాలకు, ఇటు ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి నిల్చొని ఇబ్బందులు పడుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లిలో, తోల్‌కట్ట ఆయా గ్రామాల చౌరస్తాల్లో షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గంటల తరబడి నిల్చొనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. మొయినాబాద్ మండల పరిధిలో అనేక ఇంజనీరింగ్ కళాశాలలు, పలు మెడికల్ కళాశాలలు, డెంటల్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. జంట నగరాల నుంచి విద్యార్థులు ఉన్నత విద్య కోసం రాకపోకలు చేస్తుంటారు. వారు కూడా బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



అజీజ్‌నగర్ చౌరస్తాలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు



చేవెళ్ల: ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి తరలిన నాయకులు, కార్యకర్తలు

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎ. రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. చేవెళ్ల సర్పంచ్ బి. శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంక్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, యాదయ్య తదితరులు మాట్లాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో మార్పు కావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవర సమత, మధుసూదన్‌గుప్తా, మద్దెల శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, యాదయ్య, రాములు, పాండు, ఎర్ర మల్లేశ్, మల్లారెడ్డి, మహిళాప్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, ఎర్ర గోపాల్, మాదవ్‌గౌడ్, శ్రీనివాస్, ఉన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి, బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, కొంకళ్ల చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, భార్గవ్‌కుమార్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ప్రధాన చౌరస్తాలో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, మర్రి రవీందర్‌రెడ్డి, కేబుల్ రాజు, రాజేష్‌గౌడ్, రియాజుద్దీన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారోత్సవానికి..

షాబాద్ దర్శన్, మాణయ్య, మల్లేష్‌యాదవ్, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, కేబుల్ రాజు, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, గణేష్‌గౌడ్, మాణిక్యం, శ్రీనివాస్, మహేందర్, బిక్షపతి, మినాజుద్దీన్, మక్బుల్, రాజు తదితరులు తరలి వెళ్లారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కమిటీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, కావలి రాజు ఉన్నారు.

షాబాద్: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేస్తుందని నాగర్‌గూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ అబేద్, టేకులపల్లి రాఘవేందర్ అన్నారు. ముంబాయి-బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై బాణసంచ కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. జంగయ్య, వెంకటేశ్, పరమేశ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు



షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు



మొయినాబాద్: స్వీట్లు తిని పించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పల్లె పోరుకు సిద్ధం!

- పంచాయతీ ఎన్నికలకు అధికారుల కసరత్తు
- గ్రామాల్లో రాజుకున్న రాజకీయ వేడి

షాబాద్: అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఇప్పుడిప్పుడే సేద తీరుతున్న నేతలకు విరామం లేకుండా మళ్లీ పంచాయతీ పోరుకు సిద్ధమవుతున్నారు. జనవరి, ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల పక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పంచాయతీ ఎన్నికలపై అధికారులు కసరత్తులు ప్రారంభించారు. గ్రామ సభల్లో అభ్యంతరాలను స్వీకరించి రెండు రోజుల్లో తుది జాబితాను విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం ముగియనుంది.

రిజర్వేషన్లపై అందరి దృష్టి..

బీసీ ఓటర్ల తుది జాబితా విడుదల తరువాత సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. దీంతో రాజకీయ పార్టీలు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే ఔత్సాహికులు రిజర్వేషన్లపై దృష్టి సారిస్తున్నారు. పంచాయతీలలో ఎన్నికలు జరగనుండడంతో ఇక్కడ పోటీ చేయడానికి చాలా మంది ఉత్సాహంతో ఉన్నారు. ఆయా గ్రామాల్లో ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి యువకులు, మహిళలు సిద్ధం అవుతున్నారు.



నాగరగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

షాబాద్: రబీలో బోరుబావుల కింద వరిసాగు చేసే రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచించారు.

ఇలా చేయండి..

- నారుమడి 10-12 రోజుల వ్యవధిలో ఉన్నప్పుడు మూడు దఫాలుగా దమ్ముచేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్, ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి పలుచగా నీరు కట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. చలి ఎక్కువగా ఉంటే వరిసాగులో జింకు లోపం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.
- విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీలీటరును లీటర్ నీటిలో కలిపి విత్తిన పది రోజులు, 17 రోజులకు పిచికారి చేయాలి.
- నారు తీయడానికి ఏడు రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.